# ఆపదలో వున్న వ్యక్తి రక్షించలేని ఆ పిరికి తండ్రి కోల్పోయిందేమిటి?

# కేక

కాకాని కమల కధ

రాత్రి సమయం పన్నెండు కావస్తోంది.

మొదటి ఆట సినిమా వదిలారు.

యూనివర్సిటీ ఏరియా కావటంతో చిమ్మ చీకటిగా నిశ్శబ్దంగా వుంది. దానికి తోడు బాగా ముసురు పట్టటంతో చల్లగా ఈదురు గాలి... సన్నగా తుంపర మొదలయ్యింది. అక్కడక్కడ వెలుగుతున్న వీధి దీపాలు ఆ చిమ్మ చీకటిని చేధించలేక పోతున్నాయి.

దారంత బాగా సరుగుడు, తమ్మ చెట్లు బాగా పెరిగి గాలికి పిచ్చిగా తలలూపుతున్నాయి.

ఆ చీకట్లో ఆ ముసురులో అడ్డదారంట ఇంటికి సైకిల్‌పై బయలుదేరాడు రాఘవరావ్.

అడ్డదారి కావటాన మార్గం సవ్యంగా లేదు. చీకట్లో దారి కనిపించటం లేదు. అయినా బాగా అలవాటు పడిన పరిసరాలు కావటంతో అవలీలగా తొక్కుకుని పోతున్నాడు.

సైకిల్ పాతది కావటంతో రాళ్ల రప్పలు తగిలి గొప్పల్లో పడినప్పుడు రేకు డబ్బా మోగినట్లు సైకిల్ డబడబ శబ్దం చేస్తోంది. ఇదివరకులా రాఘవరావ్ ఇప్పుడు హుషారుగా సైకిల్ తొక్కలేకపోతున్నాడు. వయసు నలభై ఐదు దాటుతుంది. గట్టిగా ఫెడల్ మీద కాలు తొక్కినప్పుడల్లా ఎగ శ్వాస వస్తోంది. పైగా సైకిల్ బాగా పాతది. దాంట్లోనూ పవరు తగ్గిపోయింది. అయినా కొత్తది కొనే శక్తి లేక అలాగే కాలక్షేపం చేస్తున్నాడు.



మెయిన్ రోడ్డు మీంచి ఇంటికి వెడితే రెండు గంటలు పడుతుంది. అడ్డదార్ని అయితే అరగంటలో పోవచ్చు. కాని రోడ్డు సరిగా ఉండదు. సురక్షితమైన దారి కాదు అని తెలిసినా అడ్డదార్నే బయలుదేరాడు.

వేగంగా పోతున్న రాఘవరావ్ సైకిల్ షడన్ బ్రేక్‌తో కిరుకిరుమంటు ఆగిపోయింది. ఆకాశంలో పెద్ద మెరుపు మెరిసింది.

దాంతోపాటే ఉరిమింది అనుకున్నాడు.

కానీ కాదు. ఆకాశం వురమలేదు. ఏ మూలనుంచో ''ఆ...మ్మా'' అన్న ఒక ఆర్తనాదం...

ఆ చిమ్మ చీకటిని ఒక అరక్షణం ఒణికించింది. గుండె జలదరించినట్లయి రాఘవరావ్ గభాల్న సైకిల్ దిగాడు.

బితుకు బితుకు మంటూ చుట్టూ చూశాడు.

ఆ తటితోపుల మధ్య... ఆ సరుగుడు, తుమ్మ చెట్ల మధ్య చీకటి మరింత చిక్కగా ఉంది. అంత వరకు సైకిల్ కి వెలుగుతున్న చిన్న లైటు కూడా ఎప్పుడో ఆరిపోయింది.

అంత చీకట్లోనూ దూరంగా చెట్ల మధ్య ఏవో ఆకారాలు పరిగెడుతున్న అలికిడి ... అడుగుల శబ్దం...

స్పష్టంగా వినిపించింది.

గొంతు తెగుతున్న కోడిలా ఎవరిదో సన్నని ఆర్తనాదం... అ...మ్మా...

రాఘవరావ్ గుండె గుభిల్లుమంది.

కళ్లు చికిలించుకుని దూరంగా చెట్లమధ్యకి చూశాడు.

సందేహం లేదు.

ఎవరో గుంపుగా చేతిలో కర్రలు పుచ్చుకుని పరిగెడుతున్నారు. వారెవర్నో తరుముతున్నారు.

ప్రశాంతంగా నిశ్శబ్దంగా దట్టంగా పెరిగిన చెట్లతో వుండే ఈ ప్రాంతంలో పట్టపగలే జనం ... ముఖ్యంయా ఆడవాళ్లు తిరగడానికి భయపడతారు.

అడపదడద యూనివర్సిటీలో గొడవలు జరిగి కుర్రాళ్లు కొట్టుకోడం, హత్యలు జరగటం కూటా ఇక్కడ పరిపాటి.

పైగా ఇప్పుడు యూనివర్సిటీలో ఏవో బాగా గొడవలుగావున్నాయని, యూనివర్సిటీ ఎలక్షన్స్ జరగుతున్నాయని, రెండు వర్గాల విద్యార్థులు ఒకళ్లని ఒకళ్లు నరుక్కుంటంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడిందని, తాత్కాలికంగా ఎలక్షన్స్ వాయిదా వేసి యూనివర్సిటీకి సెలవులు ఇచ్చారని, హాస్టల్సు ఖాళీ చేయించి విద్యార్థుల్ని ఇళ్లకి పంపించేశారని, ఈ గొడవల వెనుక రాజకీయ హస్తం ఉందని నల్గురూ అనుకోగా కూడా విన్నాడు. కానీ ఇదంతా జరిగి వారం పది రోజులు అవుతూంది.

రాఘవరావుకి ఒంటినిండా చెమట పట్టింది.

ఓ పక్క వాన తుంపర రాలుతూ చలిచలిగా వున్నా గొంతు పిడచకట్టినట్టు అయింది.

దూరంగా చెట్లమధ్య ఎవరో దబదబా ఇంకా అలాగే పరిగెడుతున్నారు.

అంతలో ఏదో పెద్ద చెట్టు కొమ్మ విరిగి **పడినట్టు ఫెళఫెళ శబ్దం అయ్యింది.**

**ఆ శబ్దంతోపాటే ''హెల్ప్... హె...ల్ప్** ... ర...క్షిం...చం...డి.. హెల్ప్.. అ... మ్మా...మ్మా...

మరణావస్థలో హృదయాన్ని చీల్చుకుని ఒక చావుకేక.

రాఘవరావు గుండె గుభిల్లుమంది.

నిలువునా మనిషి ఒణికిపోసాగాడు.

ఒక్క క్షణం వూపిరి ఆగి తిరిగి రెట్టింపు వేగంతో కొట్టుకోసాగింది.

''ఎవరు? ఎవరా కేక పెట్టింది.

దూరంగా ఆ తటి తోపుల మధ్య ఏదైనా హత్యగాని జరగటం లేదు కదా?

చప్పున సైకిల్ చెట్టుకి ఆన్చి దూరంగా ఆ కేక వచ్చిన దిశగా పరిగెత్తబోయాడు.

కాని పది అడుగులు కూడా ముందుకి పడకుండానే ఎవరో వెనక్కి లాగినట్లు ఆగిపోయాడు. నర్వీర్యంగా చెట్లచాటుకి తప్పుకున్నాడు.

దూరంగా ఆ చెట్ల మధ్య పెనుగులాట. కర్రలతో కొట్టుకొంటున్నట్లు శబ్దాలు. మృత్యువు కళ్లముందు కనిపిస్తున్నప్పుడు మనిషి చేసే భయానకమైన ఆర్తనాదంలా... అమ్మా... అన్న పిలుపు...

ఎవరు?

ఎవరది?

ఎవరైనా స్త్రీని బలాత్కరిస్తున్నారా?

ఉహు...

అది స్త్రీ ఆర్తనాదంలా లేదు. కాని ఎప్పుడో "అమ్మ" అన్న ఆ పిలుపును సుపరిచితంలా అనిపిస్తోంది.

రాఘవరావ్‌కి ఎటూ తోచనట్లు అలాగే చెట్టుచాటున నిల్చుండిపోయాడు.

దూరంగా టార్చి లైట్లు వెలుగుతున్నాయ్ . ఆరుతున్నాయ్ . తెల్లని దూది పింజెల్లా ఆకాశంలో ఎగురుతున్న మబ్బుల వెలుతురులో ఆ చెట్ల మధ్య మృత్యువుకి, జీవితానికి మధ్య జరుగుతున్న పోరాటం లీలగా కనిపిస్తూనే ఉంది.

రాఘవరావ్ ఊపిరి బిగపట్టాడు.

ఈ దారమ్మట ఎరక్కపోయి వచ్చాను ఈ సమయంలో అనుకున్నాడు.

ఇవాళ ఆఫీసుకు సెలవు పెట్టి పక్కవూరికి వెళ్లాడు. బస్ స్టాండ్ నుంచి తన ఇల్లు రెండు కిలోమీటర్ల దూరం వుంటుంది బస్టాండ్ దాకా సైకిల్ మీద వెళ్లి అక్కడ తెలిసున్న ఫ్రెండ్ ఇంట్లో సైకిల్ పెట్టి వూరికి వెళ్లాడు. తిరిగి వచ్చే వేళకి బాగా రాత్రి అవుతుంది. ఆ సమయంలో బస్సులు ఉంటాయో ఉండవో. ఆటోలకి ఖర్చు చేసే శక్తి లేక వచ్చేటప్పుడు సైకిల్‌పై



అడ్డదార్న ఇంటికి వచ్చెయ్యొచ్చు అనుకున్నాడు. ఎందుకంటే మళ్లీ పొద్దున్నే ఆఫీసుకి వెళ్లాలి.

పక్క ఊళ్లో ఏదో పెళ్లి సంబంధం ఉందని తెల్సింది. పిల్ల బాగుంటే కట్న కానుకలు అక్కర్లేదన్నాడుట పెళ్లికొడుకు.

రాఘవరావ్ పెద్ద కూతురు ప్రియంవద చక్కని చుక్క. కమ్మని గాత్రం. ప్రభుత్వ కళాశాలలో సంగీతం నేర్చుకుంటుంది. డిప్లమా పరీక్షకి కూర్చోబోతుంది. బి.ఎస్సీ హోమ్‌సైన్సుతోపాటు వైపు నేర్చుకుంది.

రాఘవరావుకి ప్రియంవద కాక ఇంకా ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు వున్నారు. కొడుకు జగన్ కాలేజీలో చదువుకొంటున్నాడు.

పెళ్లి కొడుకు దూరంగా ఎక్కడో ఉద్యోగంలో వున్నాడట. కానీ అతని తల్లిదండ్రులు పక్క వూళ్లోనే ఉంటారు. ఉదయం బయలుదేరి వెళ్లి వాళ్లని కల్సుకుని, ఇంకా ఊళ్లో ఏవో చిన్నచిన్న పన్లు ఉంటే చూసుకుని రాత్రి పదిన్నరకి అక్కడ తిరుగు బస్సు ఎక్కాడు. ఊళ్లో బస్సు దిగేసరికి పదకొండు దాటింది. స్నేహితుడి దగ్గర పెట్టిన సైకిల్ తీసుకుని అడ్డదార్ని ఇంటికి బయలుదేరాడు.

కాని ఈ అడ్డదార్లో ఇంత ప్రమాదం పొంచి వుంటుందని వూహించలేదు.

దూరంగా చెట్ల మధ్య జరుగుతున్న ఆ మారణకాండని చూస్తూ... "అమ్మా... రక్షించండి.. హెల్ప్... హెల్ప్... అంటున్న ఆర్తనాదాల్ని వింటూ శిలలా అలాగే చెట్ల చాటున నిల్చుండిపొయ్యాడు.

ఒక వ్యక్తిని నిస్సహాయుడ్ని చేసి పదిమంది అతడ్ని చంపుతున్నారని అర్థం అయ్యింది రాఘవరావ్‌కి.

"అమ్మా... రక్షించండి, హెల్ప్..." అన్న ఆర్తనాదం వింటుంటే రాఘవరావులో ఆవేశం పెల్లుబికింది.

గభాల్న చెట్లచాటునుంచి ఆ గలభా జరుగుతున్న దిక్కుగా పరుగెత్తబోయాడు.

అంతలోనే వివేకం వెన్ను తట్టింది. వాళ్లు చాలా ఆవేశంగా చేతిలో బరిసెలు ఈటెలు పట్టుకుని ఒకడ్ని ఒకడు పొడుచుకోటానికి పరుగులెడుతున్నారు. ఈ పరిస్థితిలో వాళ్లని తను ఆపగలడా?

వాళ్లని గెలవగలడా?

ఇదే ఏదన్నా సినిమాలో అయితే క్రాఫ్ చెదరకుండా ముసలి హీరో ఆ పదిమంది గూండాలని తన్ని ఆపదలో చిక్కుకున్న అమాయకుడ్ని రక్షిస్తాడు. కానీ తను ముసలి హీరో కాదు, మామూలు సామాన్య వ్యక్తి. ఈతి బాధలతో నలిగిపోతున్న బడుగు జీవి. కళ్లముందు జరుగుతున్న అన్యాయాన్ని చూసి కన్నీరు కార్చగలడే కానీ ఆపలేడు. ఒకవేళ ఆపటానికి వెళ్లినా తనకేదన్నా జరిగితే తన మీద ఆధారపడ్డవాళ్ల మాట ఏమిటి?

తనకు మాలిన ధర్మం ఉందా?

అంతే..

రాఘవరావు గభాల్న వెనక్కి తిరిగి చెట్టుకి ఆన్చిన సైకిల్ తీసి శక్తి కొద్దీ తొక్కడం మొదలుపెట్టాడు. అంతలో మెరుపులా రాఘవరావుకి యూనివర్సిటీలో చదువుకుంటున్న కొడుకు "జగన్"జ్ఞాపకం వచ్చాడు.

జగన్ కూడా ఆ ఎలక్షన్స్‌లో తలదూర్చి యాక్టివ్ మెంబర్‌గా కార్యకలాపాలు సాగిస్తూ ఈ మధ్య సరిగా ఇంటికి రావటం లేదు. వచ్చినా అర్ధరాత్రి, అపరాత్రి అనక వస్తున్నాడు.

ఆ విషయం తెల్సి రాఘవరావు నాల్గు రోజుల క్రితం కొడుకుని తీవ్రంగా హెచ్చరించాడు. ఆ గొడవల వెనక రాజకీయ హస్తాలు వున్నాయి, వాటి మధ్య తలదూర్చి చదువు పాడుచేసుకోవద్దని నయానా భయానా నచ్చచెప్పాడు. తన భార్య కళ్ల నీళ్లతో కొడుకు కాళ్లు పట్టుకుని బతిమాలినంత పని చేసింది.

అప్పట్నుంచి రాత్రివేళ కాస్త ఇంటికి వస్తున్నాడు.

ఊళ్లో ఈ కాలేజీ గొడవలు రాజకీయాల్లో ముడిపడి ముందుముందు చాలా గొడవలు జరుగుతాయని వింటున్నాడు. ఇప్పుడు ఆ తటితోపుల మధ్య జరుగుతున్న ఆ మారణహోమం చూస్తుంటే అదంతా జ్ఞాపకం వచ్చి గుండె గుభిల్లుమంది.

జగన్ తిన్నగా ఇంటికి వచ్చేశాడా? లేక తను లేడని ఎక్కడికయినా వెళ్లాడా? ఆందోళనతో సైకిల్ వేగం మరింత పెంచుతూ అడ్డదారి దాటి శివాలయం మీదుగా సందు మలుపు తిరిగాడు.

దూరంగా తన చిన్న పెంకుటిల్లు, అందులోంచి సన్నటి వెలుగు కనిపిస్తుంటే ప్రాణం వచ్చినట్లు అయ్యింది.

గబగబ సైకిల్ దిగి చెక్క గేటు తీసుకుని లోపలికి వచ్చాడు. గేటు అలికిడి "ఎవరు?" అంటూ తలుపు తెరుచుకుంది.

"ఎవరు? ఎవరది? అంటూ రాజారావ్ భార్య వసారాలోకి వచ్చింది.

సైకిల్ స్టాండ్ వేస్తున్న భర్తని చూస్తూనే భళ్లుమని ఏడుస్తూ చప్పున వాటేసుకుంది.

"ఏమండి... ఇవాళ పొద్దున్న నుంచి మన జగన్ ఇంటికి రాలేదండి. కుర్రాళ్ల మధ్య ఏదో పెద్ద గొడవ జరిగిందట.



## ఫలితాలు

ఒక సంస్థ తాము నిర్వహించిన తిట్లు పోటీ ఫలితాలను ప్రకటించారు.

మొదటి బహుమతి: వినాయక్‌రావ్ (రాజకీయ నాయకుడు)

రెండవ బహుమతి: వెంకటస్వామి (పోలీస్)

మూడవ బహుమతి: గూండారావు (రౌడీ)

–జి.రమేష్‌బాబు (పత్తిపాడు)

చాలామంది కుర్రాళ్ల మన జగన్‌మీద పగబట్టి చంపుతామని శపధాలు చేస్తున్నారట. వాడు ఇంటికి కూడా రాకుండా ఎక్కడో దాక్కున్నాడట.'' ఏడుపు గుంతుతో వెక్కిళ్లు పెడుతూ కడుపులో బాధని వెళ్లగక్కింది శాంతమ్మ.

సైకిల్ స్టాండ్ వేస్తున్న రాఘవరావ్ చెయ్యి వణికింది. సైకిల్ బ్యాలన్స్ తప్పి ధన్ మంటూ కింద పడిపోయింది.

ఇందాక తటి తోపుల మధ్య హెల్ప్... హెల్ప్... రక్షించండి... అమ్మా... అంటున్న ఆ ఆర్తనాదం ఆ గొంతు... ఎక్కడ పరిచితమైన కంఠంలా అనిపించింది

అనుకున్నాడు రాఘవరావు. కాని ఇప్పుడు... ఆ గొంతులో... ''అమ్మ'' అన్న పిలుపులో కొడుకు కంఠం స్ఫురిస్తుంది.

కొడుకు మరణయాతన తొంగి చూస్తుంది.

''నాయనా జగన్''! బాబూ... గట్టిగా వెర్రికేక పెట్టాడు రాఘవరావు.

కాని శబ్దం బయటకి రాలేదు. గొంతులోనే గురగుర్ శబ్దం చేస్తూ మాట పడిపోయింది.

కాళ్లు చేతులు ఒంకర పోతుంటే వెర్రి చూపులు చూస్తు కళ్లు తేలేసి నిలువునా విరుచుకొని పడిపోయాడు రాఘవరావు. ●

